సాక్షి రంగారెడ్డి

బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



నిద్రిస్తున్న రైతుపై దాడి

వ్యవసాయ పొలం వద్ద భార్య, కొడుకుతో కలిసి నిద్రిస్తున్న రైతుపై గుర్తుతెలియని దుండగులు దాడి చేశారు. 10లో▸



కాన్పుల సంఖ్యను పెంచండి

ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల సంఖ్యను పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ (షాద్నగర్) విజయలక్ష్మి సూచించారు. 10లో▸



వర్సిటీతో ఒప్పందం

కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం సౌత్ ఫ్లోరిడా వర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. 10లో▸

న్యూస్‌రీల్

తిర్మలాపూర్‌లో ఒడిశా బృందం



తిర్మలాపూర్‌లో కుసుమ పంటను పరిశీలిస్తున్న ఒడిశా బృందం సభ్యులు

షాబాద్: రైతులు సాగు చేసిన కుసుమ పంటను ఒడిశా రైతుల బృందం సందర్శించింది. మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి మంగళవారం చేరుకున్న బృందం సభ్యులు ఇక్కడి సాగు పద్ధతులు, సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘం చేస్తున్న కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. రైతులు సాగు చేస్తున్న బ్రకోలీ, క్యారెట్, వివిధ రకాల కూరగాయ పంటల సాగుపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.. ఒడిశాలో నూనె గింజల సాగును మెరుగు పర్చడానికి రైతు శిక్షణలో భాగంగా భారతీయ నూనె గింజల సంస్థ రాజేంద్రనగర్‌కు వచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా ఇక్కడి రైతులు చేస్తున్న సాగు పద్ధతులను పరిశీలించారని చెప్పారు. కార్యక్రమంలో టెక్నీషియన్ నందీశ్వర్, ప్రేమనంద్‌దాల్, భికున్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరానికి ప్రత్యేక బస్సులు

షాద్‌నగర్: మహా శివరాత్రిని పురస్కరించుకొని మండల పరిధిలోని రామేశ్వరం గ్రామంలో ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయానికి ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు షాద్‌నగర్ ఆర్టీసీ డీఎం ఉష ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవాలయంలో జాతర సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని బుధ, గురువారాల్లో షాద్‌నగర్ నుంచి 12 ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు చెప్పారు. ఒక్కొక్కరికీ రానుపోను చార్జీలు రూ.60 వసూలు చేయనున్నట్లు తెలిపారు. రామేశ్వరంలోని దేవాలయానికి వెళ్లే భక్తులు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రైవేటు రంగంలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం అధికారి జయశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటులో ఉద్యోగాలు కల్పించేందుకు 27వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఈ కామర్స్ రంగంలో పోస్టులు ఉన్నట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ పూర్తి చేసి, 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. వివరాలకు మల్లేపల్లిలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం లేదా 99634 93453, 90630 99306 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ట్రాన్స్‌జెండర్లకు సర్టిఫికెట్ల పంపిణీ



మీర్‌పేట: ట్రాన్స్‌జెండర్స్ తమ నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగం, స్వయం ఉపాధి లేదా ఇతర వ్యాపారాలు చేసినప్పుడే సమాజంలో గౌరవం లభిస్తుందని ఎల్‌బీనగర్ డీసీపీ సీహెచ్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ప్రజ్వల ఫౌండేషన్ వికల్ప్ సెంటర్ ఆధ్వర్యంలో మీర్‌పేట ఠాణాలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్స్ కోసం ప్రజ్వల ఫౌండేషన్ వారు వికల్ప్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వికల్ప్ సెంటర్‌ను ఇప్పటివరకు 310 మంది సందర్శించగా, 41 మందికి ఉపాధి, 32 మందికి స్వయం ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. దీంతో పాటు 15 మంది ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ అసిస్టెంట్లుగా విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా వ్యభిచారం, భిక్షాటనను అరికట్టాలన్న ఉద్దేశంతో ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో మార్పు తేవడం అభినందనీయమని అన్నారు. ట్రాన్స్‌జెండర్స్ నైపుణ్యతను బట్టి ఉద్యోగ, ఉపాధి, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ కె.నాగరాజు, ప్రజ్వల ఫౌండేషన్ జూనియర్ డైరెక్టర్ ప్రోగ్రామ్స్ అహ్మద్ అలీ, సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్, ట్రాఫిక్ అసిస్టెంట్ నక్షత్ర పాల్గొన్నారు.

‘మహా’ ఉత్సవం.. అంతా సిద్ధం



మహాశివరాత్రి ఉత్సవాలకు జిల్లాలోని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. బుధవారం ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజల కోసం నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మహేశ్వరంలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. మరోవైపు పూజకు అవసరమైన సామగ్రి, పూలు, పండ్లు కొనుగోళ్లతో మంగళవారం మార్కెట్లలో సందడి నెలకొంది.

– మహేశ్వరం

ప్రజల ప్రాణాలతో.. చెలగాటం



నకిలీ వైద్యుల వ్యవహారం

- బాధితుల అమాయకత్వమే ఆసరా
- అవసరం లేకున్నా యాంటీ బయాటిక్స్
- తనిఖీల్లో పట్టుబడుతున్న నకి‘లీలలు’
- అయినా మారని తీరు

తుర్కయంజాల్: నకిలీ వైద్యులు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. అర్హతకు మించి వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించి డాక్టర్లుగా చెలామణి అవుతున్నారు. రోగుల అమాయకత్వాన్ని క్యాష్ చేసుకుంటున్నారు. అవసరం ఉన్నా లేకున్నా యాంటీ బయాటిక్స్, స్టెరాయిడ్స్, ఓవర్ డోస్ మందులు ఇస్తూ ఇష్టం వచ్చిన వైద్యం చేస్తున్నారు. ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం జిల్లాలో వరుసగా నిర్వహిస్తున్న దాడుల్లో విస్తుగొల్పే వాస్తవాలు బయటపడుతున్నాయి.

హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చేసి..

ఎంబీఏలో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ చదివిన చంద్రశేఖర్ అనే వ్యక్తి డాక్టర్ అవతారం ఎత్తి తుర్కయంజాల్‌లో రాజర్షి ఇన్ఫర్మిటీ అనే క్లినిక్ నిర్వహిస్తున్నాడు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న లొసుగులను ఆసరాగా చేసుకుని, ఒక బ్రోకర్ ద్వారా 2023లో డా.కాత్యాయని, ఈఎన్‌టీ సర్జన్ పేరుతో పత్రాలను సృష్టించాడు. ఆమె వచ్చి వైద్యం చేస్తున్నట్లుగా బోర్డులు పెట్టి రోగులకు చికిత్స అందిస్తున్నాడు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం ఈనెల 16న క్లినిక్‌పై దాడి చేసింది. చంద్రశేఖర్ తన వద్దకు వచ్చే బాధితులకు ఇష్టానుసారంగా యాంటీ బయోటిక్స్, స్టెరాయిడ్ ఇంజక్షన్లు, సెలైన్‌లు ఎక్కించడంతోపాటు మందుల ప్రిస్క్రిప్షన్ రాస్తున్నట్లు గుర్తించారు. అధికారులు క్లినిక్‌ను సీజ్ చేసిన రోజుల వ్యవధిలోనే తిరిగి తెరవడం విశేషం. ఈ నెల 22న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల తనిఖీల్లో మరోసారి పట్టుబడడం గమనార్హం.

ప్రాణాంతక రోగాలను నయం చేస్తానంటూ..

జల్‌పల్లిలో ఓ నకిలీ ఆయుర్వేద వైద్యుడు డా.అతా ఉల్లా ఆయుర్వేద వైద్యుడినంటూ క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలను సైతం నయం చేస్తానని ప్రజలను నమ్మిస్తూ రెండున్నరేళ్లుగా క్లినిక్ నిర్వహిస్తున్నాడు. ఇతడి మాటలను నమ్మి నగరంతో పాటు, ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వైద్యం కోసం రావడం ప్రారంభించారు. దీనిపై కొందరు రిజిస్టర్డ్ ఆయుర్వేదిక్ వైద్యులు ఫిర్యాదు చేయడంతో డ్రగ్ కంట్రోల్ అధికారులు ఈ నెల 22న క్లినిక్‌ను సీజ్ చేశారు. అతడు ఇస్తున్న మందులను ల్యాబ్‌కు పంపించారు.

పదో తరగతి చదివి అల్లోపతి వైద్యం

వీరే కాకుండా ఇటీవల అధికారుల తనిఖీల్లో ల్యాబ్ టెక్నీషియన్ చదివి ప్రభుత్వ అనుమతి, డాక్టర్ లేకుండా వైద్యం చేస్తున్న ఆయాన్ష్ డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వహిస్తున్న పి.మహేశ్, ఏఎన్ఎం చదివి కమ్మగూడలో స్మార్ట్ క్యూర్ క్లినిక్ నిర్వహిస్తున్న చంద్రమ్మ, పదో తరగతి మాత్రమే చదివి వాసు మెడికల్ హాల్‌లో అల్లోపతి వైద్యం చేస్తున్న సీహెచ్ శ్రీనివాసులను ఇటీవల అధికారులు గుర్తించారు. ఎన్ఎంసీ 34, 54 సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేశారు.

చట్టరీత్యా చర్యలు తప్పవు



రెండు, మూడు బృందాలను ఏర్పాటు చేసి నకిలీ వైద్యులను గుర్తించి చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. అర్హతకు మించి వైద్యం చేసే ఏ ఒక్కరినీ వదిలిపెట్టం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. గుర్తింపు పొందిన వైద్యులతో పాటు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోవాలి. నకిలీ వైద్యుల వద్దకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

– వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారి

బడ్జెట్‌లో పేదలకు తీరని అన్యాయం

- సెమినార్‌లో పలువురు వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న వీఎస్ రావు

తుర్కయంజాల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేద, మధ్య తరగతి ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ రావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్‌రాములు, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు జంగారెడ్డి అన్నారు. పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ‘కేంద్ర బడ్జెట్ – ప్రజలపై ప్రభావం’ అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం పూర్తిగా కార్పొరేట్ చేతుల్లోకి వెళ్లిపోతోందని, మోదీ పాలనలో కార్పొరేట్ శక్తులు మాత్రమే లాభాలను ఆర్జిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలను పూర్తిగా విస్మరించి కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చేలా ఉందని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వ తీరుపై కార్మిక, కర్షక వర్గాలు పోరాడాల్సిన సమయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాంచందర్, మధుసూదన్ రెడ్డి, నాయకులు డి. జగదీశ్, డి.కిషన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కంటి సంరక్షణకు చర్యలు

నేషనల్ ప్రోగ్రాం కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మోతీలాల్



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ మోతీలాల్

షాద్‌నగర్: విద్యార్థుల కంటి సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపట్టిందని నేషనల్ ప్రోగ్రాం కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మోతీలాల్ తెలిపారు. షాద్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో విద్యార్థులకు నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కంటి పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు కల్పించాలన్నారు. శిబిరానికి విచ్చేసిన ప్రతి విద్యార్థికి సంబంధించి కంటి పరీక్షల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, అవసరమైన వారికి వెంటనే అద్దాలు తెప్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ బాలసురక్ష వైద్యులు డాక్టర్ విజయలక్ష్మి, సుజాత, శ్రీకాంత్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



❖ పింఛన్లకోసం పడిగాపులు

వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు ప్రభుత్వం ఇచ్చే పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ప్రతీ నెల 1వ తేదీ నుంచి ఇవ్వాల్సిన పింఛన్లు ఆలస్యంగా నెలాఖరులో ఇస్తున్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో సుమారు 500 మంది లబ్ధిదారులు ఉన్నారు. పింఛన్లు ఇస్తున్నట్లు తెలియడంతో మంగళవారం ఉదయాన్నే వారంతా వచ్చి మున్సిపల్ కార్యాలయం ముందు కూర్చున్నారు. సాయంత్రం వరకు పడిగాపులు కాశారు. పోస్టల్ సిబ్బంది సాయంత్రం 4 గంటల తరువాత పింఛన్లు ఇచ్చారు.

– మొయినాబాద్

పత్తి దిగుబడిలో తెలంగాణ టాప్

ఏసీఏఆర్ఐ డైరెక్టర్ షేక్ ఎన్ మీరా



కృషి విజ్ఞాన కేంద్రంలో మాట్లాడుతున్న షేక్ ఎన్ మీరా

హయత్‌నగర్: పత్తి దిగుబడిలో దేశంలోనే తెలంగాణ ముందుందని, దిగుబడిని పెంచేందుకు అధిక సాంద్రతా విధానాలను రైతులకు అందిస్తున్నామని ఏసీఏఆర్ఐ డైరెక్టర్ షేక్ ఎన్ మీరా అన్నారు. ఐసీఏఆర్, జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం హయత్‌నగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో పత్తిలో హైడెన్సీ ప్లాంటింగ్ (అధిక సాంద్రత) విధానంపై రైతు సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. హైడెన్సీ విధానంతో తక్కువ స్థలంలో ఎక్కువ మొక్కలు నాటి అధిక దిగుబడిని సాధించేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఇందుకు రైతులు నాలుగు యాజమాన్య పద్ధతులను అవలంబించాలని సూచించారు. ఈ విధానంతో పంట దిగుబడి ఎకరాకు 15 క్వింటాళ్ల వరకు వస్తుందని, 20 శాతం కూలీల ఖర్చులు, పురుగు మందుల ఖర్చులు తగ్గుతాయన్నారు. తద్వార రైతుకు లాభాలు పెరుగుతాయని తెలిపారు. ఈ విధానంపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని, ఇందుకు సదస్సులు, ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. స్థానిక పరిస్థితులకు అనుకూలంగా ఈ పద్ధతుల్లో మార్పు చేయాల్సి ఉంటుందని క్రీడా డైరెక్టర్ ఎస్‌కే బాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు, కేవీకే డైరెక్టర్ చంద్రకాంత్, నోడల్ అధికారి విజయ్‌కుమార్, ఏడీ సుజాత, చీఫ్ టెక్నికల్ అధికారి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చర్యలు

జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి



చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

చేవెళ్ల: రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో ఎక్కడా నీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి అన్నారు. చేవెళ్ల, మొయినాబాద్ ఎంపీడీఓ కార్యాలయాలను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులు పరిశీలించి అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. చేవెళ్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటికే మండలాల వారీగా, గ్రామాల్లో ఉన్న నీటి వసతులు, వనరులపై రిపోర్టులను సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతానికి జిల్లాలో ఎక్కడా ఎలాంటి నీటి సమస్య లేదని, భవిష్యత్తులో వస్తే ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మిషన్‌భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీడీఓలతో కలెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. జెడ్పీ సీఈఓ వెంట చేవెళ్ల ఎంపీడీఓ హిమబిందు, సీనియర్ అసిస్టెంట్ రవీందర్ తదితరులు ఉన్నారు.

ఆలయ పరిసరాల్లో మద్యం, మాంసం విక్రయాలా..!

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరంలోని ఉత్తర రామలింగేశ్వరస్వామి దేవాలయ పరిసరాల్లో మద్యం, మాంసం విక్రయించరాదని వెంటనే అలాంటి వాటిని నిలిపివేయాలని మంగళవారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ పరిసర ప్రాంతాల్లో కొందరు మద్యం, మాంసం, గుట్కాలు విక్రయిస్తూ అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మద్యం, మాంసం, గుట్కా విక్రయాలను నిలిపివేయాలని కోరుతూ రాయికల్‌కు చెందిన మోహన్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ పరిశీలించిన న్యాయస్థానం పవిత్ర దేవాలయం పరిసరాల్లో మద్యం, మాంసం విక్రయాలు ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్, పోలీసుశాఖలను ఆదేశించింది.

మాసబ్ చెరువులో మట్టి డంపు చేస్తే చర్యలు



చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి తొలగింపు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో అక్రమంగా మట్టిని డంప్ చేస్తే వాళ్లా చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని ఇరిగేషన్ డీఈ చెన్న కేశవ రెడ్డి, ఏఈ వంశీ హెచ్చరించారు. సర్వే నంబర్ 173, 175లో ఇటీవల సత్యనారాయణ అనే వ్యక్తి డంప్ చేసిన మట్టిని మంగళవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి తొలగింపు పనులు చేపట్టారు. సాయంత్రం వరకు సుమారు 1000 క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించామని, మరో 500 క్యూబిక్ మీటర్ల మట్టి డంప్ ఉందని, దాన్ని కూడా పూర్తిగా తొలగిస్తామని పేర్కొన్నారు. మట్టిని డంప్ చేసి చెరువు ఆక్రమణకు యత్నించిన సత్యనారాయణపై చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ నిజాం తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ హసన్ నగర్‌లోని మదీనా మసీదు సమీపంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుంచి స్పందన లభించింది. వైద్య శిబిరంలో రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేశారు.

ఊరికి వెళ్తానని.. మేస్త్రీ అదృశ్యం


ఏసురత్నం (ఫైల్)

యాచారం: తన తల్లికి ఆరోగ్యం బాలేదని ఊరెళ్లిన వ్యక్తి ఇంటికి చేరుకోని ఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ లిక్కి కృష్ణంరాజు తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన వేసుపోగు ఏసురత్నం రెండు నెలల కిందట భవన నిర్మాణ పనుల్లో మేస్త్రీ పని చేయడానికి మండలంలోని తాడిపర్తి గ్రామానికి వచ్చి బంధువుల వద్ద ఉంటున్నాడు. ఈ నెల 8న తన తల్లికి బాగోలేదని స్వగ్రామానికి వెళ్తానని చెప్పి వెళ్లాడు. అటు స్వగ్రామానికి వెళ్లకపోవడం, ఇటు తాడిపర్తికి రాకపోవడంతో మంగళవారం ఆయన బంధువులు గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712662726కు సమాచారం అందించాలని కోరారు.

ఫాంహౌస్‌పై పోలీసుల దాడి

మొయినాబాద్: ఎలాంటి అనుమతులు లేకుండా డీజే సౌండ్‌తో పార్టీ నిర్వహిస్తున్న ఫాంహౌస్‌పై పోలీసులు దాడి చేశారు. వివరాలిలా ఉన్నాయి. మొయినాబాద్‌లోని జెబెల్ అర్బేడ్ ఫాంహస్‌లో మంగళవారం తెల్లవారుజాము 4 గంటల సమయంలో ఎలాంటి అనుమతి లేకుండా డీజే సౌండ్ పెట్టి పార్టీ నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఫాంహౌస్‌పై దాడి చేసి పార్టీ నిర్వహిస్తున్న వారితోపాటు ఫాంహౌస్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీ అపహరణ

ఇబ్రహీంపట్నం: గుర్తు తెలియని దుండగుడు స్కూటీని అపహరించిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక శ్రీరాంనగర్ కాలనీకి చెందిన గరిగే రవీందర్‌గౌడ్ తన స్కూటీని సంతోష్ థియేటర్ వద్ద నిలిపి వెళ్లాడు. తాళం వదిలి వెళ్లడంతో దుండగుడు స్కూటీని అపహరించుకొని వెళ్లిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు

సౌత్ ఫ్లోరిడా వర్సిటీతో ఒప్పందం


ఒప్పందం చేసుకుంటున్న కళాశాల ప్రతినిధులు

మొయినాబాద్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కేజీ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం సౌత్ ఫ్లోరిడా యూనివర్సిటీతో బిజినెస్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం కేజీరెడ్డి కళాశాల చైర్మన్ కె.కృష్ణారెడ్డి, సౌత్ ఫ్లోరిడా ముమా కళాశాల ప్రతినిధి భువన్ ఫుల్‌హెల్కర్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఈ ఒప్పందం వల్ల బోధన సలహాలు, సూచనలతోపాటు మేనేజ్‌మెంట్ విద్యలో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు, నైపుణ్య శిక్షణకు పరస్పర సహకారానికి ఒప్పందం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి సీహెచ్ చందన, ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అకాడమిక్ డీన్ నరసయ్య, రీసెర్చ్ డీన్ జయహరి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ డీన్ డానియల్ ప్రభాకర్, అధ్యాపకులు ఉదయశ్రీ, సంధ్య సంయుక్త పాల్గొన్నారు.

శివోహం.. మహోత్సవం


ప్రత్యేక పూజలు చేస్తున్న ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ సాయికుమార్


బందోబస్తుపై సమీక్ష సమావేశంలో డీసీపీ సునీతారెడ్డి

శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

మహేశ్వరం: ప్రసిద్ధిగాంచిన శివగంగ రాజరాజేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఆలయంలో భక్తులు శివ పార్వతులు, గంగాదేవికి అభిషేకం, కుంకుమార్చన, మంత్రపుష్పం, హారతీ, పుష్పాలంకరణ, పలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో గణపతిపూజ, తదితర పూజలను ఆలయ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, గ్రామ పెద్ద లు, భక్తులు నిర్వహించారు. ఆలయం ముందు ఉన్న గజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆల య చైర్మన్ అల్లె కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రాకేష్, శంకర్, సువర్ణ, తిరుపతయ్య, నరేష్, సాయిలు, శ్రీశైలం, ఆలయ ఈఓ మురళీకృష్ణ, మాజీ సర్పంచ్ ఆనందం, మాజీ ఎంపీటీసీ సుదర్శన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

పటిష్ట బందోబస్తు

మహేశ్వరం శ్రీశివగంగ రాజరాజేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకుంటామని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను ఆమె ఏసీపీ, సీఐలతో కలిసి పరిశీలించారు. అనంతరం పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సుమారు 350 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకుంటారన్నారు. ప్రతి పోలీసులు అధికారి, సిబ్బంది భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆలయం చుట్టు పక్కల నాలుగు విభాగాలుగా పోలీసులతో బందోబస్తు, చెక్ పోస్టుల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. పోలీసులకు భక్తులు, పాలకమండలి సభ్యులు సహకరించి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, సీఐలు వెంకటేశ్వర్లు, గురువారెడ్డి, కృష్ణంరాజు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పోస్టింగ్‌లపై చర్యలు తీసుకోవాలి

సర్వీస్ అసోసియేషన్ ఫర్ విజనరీ టీచర్స్ అసోసియేషన్

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లా విద్యాశాఖలో స్పౌజ్ పేరుతో భారీగా అక్రమాలు జరిగాయని, కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని సర్వీస్ అసోసియేషన్ ఫర్ విజనరీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల మధుకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు బొడ్డు రవి, ప్రధాన కార్యదర్శి సురేశ్‌లు సంయుక్తంగా ఓ ప్రకటనలో ఆరోపించారు. జీవో 317 కేబినెట్ సబ్‌కమిటీ సిఫార్సుల ప్రకారం భారీ అవకతవకలు జరిగాయన్నారు. తలకొండపల్లి మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పడకల్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిషుగా పని చేస్తున్న వారి స్పౌజ్ స్కూల్ అసిస్టెంట్ నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి కౌన్సెలింగ్ ద్వారా అదే మండలంలోని జెడ్పీహెచ్ ఖానాపూర్ పాఠశాలకు మొదటగా కేటాయిస్తే విధుల్లో చేరలేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అన్యాయం చేసి 24 శాతం హెచ్‌ఆర్ఏ ప్రాంతం సరూర్‌నగర్ మండలంలోని రాజీవ్‌గాంధీ పాఠశాలకు కేటాయిస్తూ 20 రోజుల తర్వాత మోడిఫికేషన్ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జెడ్పీహెచ్ఎస్ తొర్రూర్ ఉన్నత పాఠశాలలో ఖాళీ పోస్టులు లేకున్నా స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిషు, సోషల్ స్పౌజ్ పోస్టులు నింపడం ఎలా సాధ్యమైందన్నారు. ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపి, అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఉమెన్స్ డే రోజు 'రన్ ఫర్ యాక్షన్-2025'

సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో మార్చి 8న నగర షీ-టీమ్స్ 'రన్ ఫర్ యాక్షన్-2025' పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. పీవీ మార్గ్‌లోని పీపుల్స్ ప్లాజాలో జరిగే ఈ 5కే, 2కే పరుగుకు సంబంధించిన పోస్టర్‌ను కొత్వాల్ సీవీ ఆనంద్ మంగళవారం ఆవిష్కరించారు. వీటిలో పాల్గొనాలని భావించేవారు (https://rfa.bebetter.run) వెబ్ సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మహిళా భద్రత విభాగం డీసీపీ లావణ్య తెలిపారు. 'మహిళల భద్రతకు అవసరమైన చర్యలు వేగవంతం చేయండి' అనే థీమ్‌తో ఈ రన్ నిర్వహిస్తున్నారు.

కాన్పుల సంఖ్య పెంచండి

డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయలక్ష్మి


రికార్డును పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

కేశంపేట: ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పుల సంఖ్యను పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ(షాద్‌నగర్) విజయలక్ష్మి సూచించారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులతో పాటు, ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో ఓపీని 68 నుంచి 100కు పెంచాలని, రక్త నమూనాలను 19 నుంచి 30 వరకు పెంచాలని ఆదేశించారు. పరీక్షలకు కొండాపూర్‌లోని తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు పంపించాలని సూచించారు. బీపీ, షుగర్ రోగులకు నెల రోజులకు సరిపడా మందులను అందించాలన్నారు. అనంతరం మండల పరిధిలో పాటిగడ్డ గ్రామంలోని కేజీబీవీ పాఠశాలను ఆమె సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. వేసవి కాలంలో తగిన జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నిఖిత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఎంపీహెచ్ఈఓలు నరసింహారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కేజీబీవీ ఎస్ఓ గౌసియా బేగం, ఏఎన్ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అప్పు చెల్లించడం లేదని..

బైక్ లాక్కెళ్లిన పీఏసీఎస్ అధికారులు

యాచారం: అప్పు చెల్లించడం లేదని యాచారం పీఏసీఎస్ అధికారులు ఓ మహిళ రైతు కుటుంబానికి చెందిన బైకును మంగళవారం లాక్కెళ్లారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ గ్రామానికి చెందిన ఇక్క మల్లమ్మకు నక్కర్తమేడిపల్లి గ్రామంలోని సర్వే నంబరు 95లో మూడు ఎకరాల పట్టా భూమి ఉంది. దానిపై 2016లో యాచారం పీఏసీఎస్‌లో మార్టిగేట్ చేసి రూ.4,28,400 అప్పును తీసుకుంది. ప్రస్తుతం అది అసలు, వడ్డీతో కలిపి రూ.6 లక్షలు దాటింది. గత సర్కార్ హయాంలో సదరు భూమిని ఫార్మాసిటీకి తీసుకున్నారు. అందుకుగానూ రూ.12.50 లక్షల పరిహారాన్ని పొందారు. తీసుకున్న అప్పును చెల్లించాలని పలుమార్లు యాచారం పీఏసీఎస్ అధికారులు లీగల్ నోటీసులు పంపారు. దీనికి మల్లమ్మ స్పందించకపోవడంతో మంగళవారం పీఏసీఎస్ సీఈఓ నాగరాజు, యాచారం డీసీసీబీ బ్యాంకు మేనేజర్ నాగలక్ష్మీలు గ్రామంలోని ఆమె ఇంటికి వెళ్లారు. అక్కడ ఆమె కుమారుడి పర్వతాలుకు చెందిన బైక్‌ను యాచారంలోని పీఏసీఎస్ కార్యాలయానికి తీసుకెళ్లారు. రూ.లక్ష విలువ చేసే బైక్‌ను తీసుకెళ్లితే మొత్తం అప్పు తీరుతుందా.. అని ఆ మహిళ రైతు ప్రాధేయపడినా అధికారులు ససేమిరా అన్నారు. వచ్చే నెల 30 లోపు మొత్తం అప్పు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలియజేశారు.

పొలం వద్ద నిద్రిస్తున్న రైతుపై దాడి

మాస్కులు ధరించి కత్తులతో బెదిరింపు


మేడిపల్లిలో రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న సీఐ పవన్‌కుమార్‌రెడ్డి

మొయినాబాద్: వ్యవసాయ పొలం వద్ద భార్య, కొడుకుతో కలిసి నిద్రిస్తున్న రైతుపై గుర్తుతెలియని దుండగులు దాడి చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని మేడిపల్లిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లికి చెందిన ధన్‌రాజ్ అతని భార్య సరిత, కొడుకు జగదీష్ సోమవారం రాత్రి 10 గంటల వరకు వ్యవసాయ పొలం వద్ద పనిచేశారు. పని ముగించుకుని అక్కడే నిద్రపోయారు. ముఖాలకు మాస్కులు పెట్టుకున్న ఇద్దరు దుండగులు అటువైపు రావడంతో సరిత ఎవరని ప్రశ్నించింది. చప్పుడు చేస్తే చంపేస్తామని దుండగులు బెదిరించారు. వెంటనే ఆమె భర్తను నిద్రలేపడంతో దుండగులు పారిపోయారు. కొద్దిసేపటి తరువాత మరో ఇద్దరు దుండగులను తీసుకుని మొత్తం నలుగురు కత్తులు, పైపులు తీసుకుని వచ్చి ధన్‌రాజ్‌పై దాడి చేశారు. గొంతు, చెవి కోసి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన ధన్‌రాజ్‌ను చికిత్సకోసం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్ల చోరీ

మేడిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన కె.రాజు, కొత్తపల్లి నరేందర్, ఎస్.అంతయ్య, పొద్దటూరి మల్లేష్ పొలాల వద్ద దుండుగులు బోరు మోటార్ల నుంచి కేబుల్ కట్ చేసుకువెళ్లారు. రైతులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. కేబుల్ వైర్ల చోరీకి వచ్చిన దుండగులే ధన్‌రాజ్‌పై దాడి చేసి ఉండవచ్చని గ్రామస్తులు, పోలీసులు అనుమానిస్తున్నారు. నెల రోజులుగా వ్యవసాయ బోర్ల వద్ద తరచూ కేబుల్ వైర్ల చోరీ జరుగుతుందని గ్రామస్తులు వాపోయారు.

భూకైలాస్‌లో భద్రత కట్టుదిట్టం

తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు రూరల్: మండల పరిధిలోని అంతారం తండా భూకైలాస్‌లో ద్వాదశ జ్యోతిర్లింగ దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలసంఖ్యలో తరలి రానున్నారు. బుధవారం మహారాష్ట్ర నుంచి క్యాబినెట్ మంత్రి సంజయ్ రాథోడ్ హాజరవుతున్నారు. మధ్యాహ్నం బేగంపేట విమనాశ్రయం నుంచి హెలిపాడ్‌లో భూకై లాస్‌కు చేరుకుంటారు. నీటి గుండా స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా హెలిపాడ్ ప్రదేశాన్ని మంగళవారం డీఎస్పీ బాలకృష్ణారెడ్డి పరిశీలించారు. సిబ్బందితో పటిష్ట భద్రతను ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, ఆలయ వ్యవస్థాపకులు శంకర్ నాయక్‌పవార్, వాసు నాయక్‌పవార్ పాల్గొన్నారు.

నవజాత శిశువుల విక్రయం!

- ఆడ బిడ్డకు రూ.1.5 లక్షలు, మగ బిడ్డకు రూ.2.5 లక్షల చొప్పున అమ్మకం
- గుజరాత్ నుంచి రైళ్లలో అక్రమంగా పసికందుల తరలింపు
- తెలుగు రాష్ట్రాల్లో పిల్లలు లేని తల్లిదండ్రులకు అప్పగింత

సాక్షి, సిటీబ్యూరో: గుజరాత్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా నవజాత శిశువులను తరలించి, విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టు రట్టయింది. అహ్మదాబాద్‌లోని ప్రధాన సూత్రధారి నుంచి ఆడబిడ్డకు రూ.1.5 లక్షలు, మగ బిడ్డకు రూ.2.5 లక్షల చొప్పున ఇచ్చి కొనుగోలు చేసి, రూ.4-5 లక్షలకు నగరంలో పిల్లలు లేని దంపతులకు విక్రయిస్తుండగా.. నిందితులను, కొనుగోలు చేసిన తల్లిదండ్రులను రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. ఆయా వివరాలను కమిషనర్ జి.సుధీర్‌బాబు మంగళవారం మీడియాకు వెల్లడించారు. నూరారంకు చెందిన కోల కృష్ణవేణి నగరంలో ఓ కంపెనీ మెడికల్ రిప్రజెంటెటివ్‌గా పనిచేస్తోంది. ఈమెకు సంతానం కలుగకపోవడంతో భర్తకు విడాకులిచ్చింది. ఈ క్రమంలో ఏడాది క్రితం బిడ్డను కొనుగోలు చేయడం/దత్తత తీసుకోవడంలో తనకు సహకరించాలని కోరుతూ కృష్ణవేణికి తెలిసిన వ్యక్తి ఒకరు ఆమెను సంప్రదించారు. దీంతో ఆమె సామాజిక మాధ్యమాలలో వెతకగా..ఢిల్లీకి చెందిన మనోజ్‌తో పరిచయం ఏర్పడింది. రూ.5 లక్షలకు డీల్ కుదుర్చుకున్న మనోజ్.. మగ బిడ్డను హైదరాబాద్‌కు తీసుకొచ్చి విక్రయిస్తుండగా గోపాలపురం పోలీసులు పట్టుకున్నారు. మనోజ్‌తో పాటు కృష్ణవేణిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

జైలు నుంచి బయటికొచ్చాక..

జైలు నుంచి బయటికొచ్చాక కృష్ణవేణి ప్రవృర్తనలో ఎలాంటి మార్పు రాలేదు. సులభంగా డబ్బు సంపాదించే మార్గం కావడంతో మళ్లీ అక్రమంగా పిల్లలను విక్రయించే దందాను ప్రారంభించింది. గతంలో పరిచయమైన పిల్లల విక్రయం, తరలించే సభ్యులతో కలిసి ముఠాను ఏర్పాటు చేసింది. కొత్తపేటకు చెందిన బట్టు దీప్తి, ఈమె భర్త శ్రవణ్ కుమార్, గుజరాత్‌కు చెందిన గౌతమ్, సావిత్రి దేవి, ఫలక్‌నుమాకు చెందిన శారద, కవాడిగూడకు చెందిన సంపత్ కుమార్‌లతో కలిసి గ్యాంగ్‌ను ఏర్పాటు చేసింది. సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడిన గుజరాత్‌కు చెందిన వందన అనే మహిళ నుంచి నవజాత శిశువుల విక్రయ ఒప్పందం చేసుకుంది. సునీత సుమన్, సావిత్రీ దేవిలు పిల్లలను రైళ్లలో హైదరాబాద్‌కు తీసుకొచ్చేవారు. అనంతరం మధ్యవర్తులు శారద, ఉమారాణి, జయశ్రీ, శ్రవణ్, సోని కీర్తిల ద్వారా పిల్లలు లేని తల్లిదండ్రులకు విక్రయించేవారు. ఒక్కో బిడ్డ విక్రయం మీద మధ్యవర్తులకు ఒక్కో శిశువు మీద రూ.50 వేల చొప్పున కమీషన్ అందించేది.

విద్యావంతులే కొనుగోలుదారులు...

అక్రమంగా పిల్లలను కొనుగోలు చేసిన వారిలో విద్యావంతులు, ఉన్నత హోదాల్లో ఉన్నవారే అధికంగా ఉన్నారు. విజయవాడలోని ఎస్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఓగుటి నాగవెంకట పవన్ భగవాన్, భార్య రమా శ్రావణి, సైదాబాద్‌కు చెందిన తెప్పల వినయ్ కుమార్, భార్య స్వాతి, మహబూబాబాద్‌కు చెందిన లింగల రమేష్‌లపై పిల్లలను కొనుగోలు చేసినందుకుగాను జువైనల్ జస్టిస్ చట్టం (జేజే) కింద కేసులు నమోదు చేశారు. వీరి మీద బీఎన్ఎస్ చట్టం సెక్షన్ 143(4)(5) రెడ్‌విత్ 3(5)లతో పాటు జేజే సెక్షన్ 80, 81, 87, 88ల కింద కూడా కేసులు నమోదు చేశారు.

డబ్బు కోసం వచ్చి పోలీసులకు చిక్కి..

ఈ ముఠా అక్రమంగా పిల్లలను విక్రయించడంతో పాటు నకిలీ జనన ధృవీకరణ పత్రాలు, దత్తత ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులను సృష్టిస్తున్నారు. వీటిని శిశువులను కొనుగోలు చేసిన తల్లిదండ్రులకు అందజేస్తున్నారు. ఈక్రమంలో పిల్లలను కొనుగోలు చేసిన పేరెంట్స్ మొత్తం సొమ్ము ఇవ్వకపోవడంతో వారిని హైదరాబాద్‌కు రప్పించారు. ఈమేరకు విశ్వసనీయ సమాచారం అందడంతో మల్కాజ్‌గిరి స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ), చైతన్యపురి పోలీసులు, సీడబ్ల్యూసీ అధికారులతో కలిసి చైతన్యపురి బస్టాప్ వద్దకు చేరుకున్నారు. కృష్ణవేణి, సావిత్రి, సంపత్‌లు పసికందును ఎత్తుకొని అనుమానాస్పదంగా సంచరిస్తుండటం గమనించారు. వారిని అరెస్టు చేసి విచారించగా..మరో నిందితురాలు దీప్తి ఇంట్లో మరో ముగ్గురు శిశువులను గుర్తించారు. పిల్లలను సీడబ్ల్యూసీ అధికారులకు అప్పగించారు. 11 మందిని అరెస్టు చేసి, జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

వందన చిక్కితేనే గుట్టు తెలిసేది..

ఈ కేసులో అహ్మదాబాద్‌కు చెందిన ప్రధాన సూత్రధారి వందన చిక్కితేనే అసలు గుట్టు వీడుతుంది. అసలు పిల్లలను ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు? ఆసుపత్రి, ఇతరత్రా ప్రదేశాల నుంచి అపహరిస్తున్నారా? లేక తల్లిదండ్రులే పిల్లలను విక్రయిస్తున్నారా? కృష్ణవేణి తరహాలో ఇంకా ఎంత మంది ఉన్నారు వంటి అన్ని అంశాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు తెలిపారు. నిందితులు అరెస్టు కాగానే.. వందన సైతం ఫోన్ స్విచాఫ్ చేసుకొని, అజ్ఞాతంలోకి వెళ్లిపోయిందని, దీంతో ప్రత్యేక బృందాలతో ఆమె కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.